అసంపూర్తి పనులతో అవస్థలు



హైదర్‌గూడ పదహారు షటర్ల ప్రాంతంలో నిలిచిపోయిన రోడ్డు పనులు



కాంతారెడ్డినగర్‌లో నత్తనడకన సాగుతున్న పనులు



గుంతలమయంగా మారిన రోడ్డు

నత్తనడకన అభివృద్ధి పనులు

- అధ్వానంగా హనుమాన్ ఆలయ జంక్షన్ నుంచి లంగర్‌హౌస్ వెళ్లే ప్రధాన రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

అత్తాపూర్: అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి కాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అత్తాపూర్ ప్రధాన రహదారి పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే హనుమాన్ ఆలయ జంక్షన్ నుంచి లంగర్‌హౌస్ వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు పనులు పూర్తికాలేదు. అసంపూర్తిగా పనులు వదిలేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు సమీపంలోనే కాంతరెడ్డినగర్‌లో రోడ్డు పనులు చేసేందుకు ఆ రోడ్డును తవ్వేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రోడ్డు మార్గం శిథిలమైపోయింది. దీంతో ఆ మార్గం గుండా ప్రయాణికులు రాకపోకలు నిలిచిపోయాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమాలు నత్తనడకన సాగడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేపట్టిన కార్యక్రమాన్ని పూర్తి చేయకుండానే మరో కార్యక్రమాన్ని చేపడుతూ అంతర్గత రహదారులను ఛిద్రం చేస్తున్నారు.

అర్ధంతరంగా నిలిచిన పనులు..

గతేడాది వర్షాకాలం హైదర్‌గూడ 16 షెటర్ల చౌరస్తా నుంచి ఉపర్‌పల్లిలో ఉన్న కోర్టు వరకు కొనసాగిన రోడ్డు మార్గం పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. 500 మీటర్ల రోడ్డు మార్గాన్ని పూర్తి చేసేందుకు దాదాపు రెండు నెలల సమయాన్ని తీసుకున్నారు. ప్రతినిత్యం రద్దీగా ఉండే మూసీ నది రోడ్డు మార్గంలో యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. అప్పటికే గుంతలమయమైన రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అసలే వర్షాకాలం వాతావరణం పరిస్థితులు అనుకూలించే పరిస్థితులు లేని సమయంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

సమస్యలపై స్పందిస్తున్నాం..



స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. ప్రజలు స్థానిక సమస్యలపై పూర్తి అవగాహనతో ఉన్నారు. సోషల్ మీడియా ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. సమస్యలను గుర్తించిన వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకురావడం ఆ వెంటనే సమస్యను పరిష్కరిస్తున్నాం. ఈశ్వర్ థియేటర్ సమీపంలో ఆర్‌ఎస్ బ్రదర్స్ షాపింగ్ మాల్ ప్రాంతంలో సమస్యను గుర్తించాం. కాంతారెడ్డి నగర్ రోడ్డు నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేస్తాం. సర్కిల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు జవాబుదారీతనంతో ఉండాలి.

-రవికుమార్, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఉన్న సీతారామచంద్ర అభయాంజనేయ స్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ వి.నాగరాజు తెలిపారు. వార్షికోత్సవాల్లో మొదటి రోజు శనివారం సాయంత్రం 6 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, భగవత్ ప్రార్థన, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, అంకురార్పణ, వైనతేయ ప్రతిష్ట, నివేదన మంగళ శాసనము కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతిరోజూ సుప్రభాత సేవ, నిత్యారాధన, అన్నప్రసాద వితరణ, శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, నిత్యహోమం, నిత్య పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. 8వ తేదీ మంగళవారం సీతారామచంద్రస్వామిల కల్యాణం, 10న చక్రతీర్థంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. వార్షిక పూజలు గోవర్ధనం బట్టరాచార్యస్వామి, గోవర్ధన రఘువాచార్య ఆధ్వర్యంలో కొనసాగుతాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాలు, పూజలను విజయవంతం చేయాలని చైర్మన్ కోరారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజేంద్రనగర్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సూచించారు. శుక్రవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద రాజేంద్రనగర్ మండలంలోని ఆయన షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. రాజేంద్రనగర్ మండల పరిధిలో గతంలో దరఖాస్తు చేసుకున్న 501 మందికి చెక్కులు అందజేసినట్లు తెలిపారు. ఇందులో 426 షాదీముబారక్, 75 కల్యాణలక్ష్మి చెక్కులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.రాములు, రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పార్టీ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, ధనుంజయ్, నార్సింగ్ వ్యవసాయ కమిటీ డైరెక్టర్ బండారి శంకర్ పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి



కార్యక్రమంలో ఎంఈఓ విజయ్‌కుమార్ తదితరులు

బండ్లగూడ: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గండిపేట మండల ఎంఈఓ విజయ్‌కుమార్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో కార్పొరేషన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రొగ్రాంలో భాగంగా హరీష్‌గౌడ్ యూఎస్‌టీ గ్లోబల్ కంపెనీతో కలిసి ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేశారు. ఉపాధ్యాయురాలని వలంటీర్‌గా నియమించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ చేతుల మీదుగా నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కంపెనీ వారు ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి కార్పొరేట్ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, అల్మారాలు, ఆర్వో ప్లాంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ కోసం ఇంటర్నెట్‌తో పాటు పలు ప్రోగ్రాంలను అందించే యాప్‌లను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యశోద, మాజీ కార్పొరేటర్ పాండు, ఐదో వార్డు కంటెస్టెడ్ కార్పొరేటర్ రామ్‌ప్రసాద్‌రావు, యూఎస్‌టీ గ్లోబల్ కంపెనీ సీఎస్ఆర్ టీం, లర్నింగ్ లైట్స్ ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ నిర్మించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న రాజు తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: లక్ష్మీగూడలో భూగర్భ డ్రైనేజీ నిర్మించాలని లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అడికే రాజు జలమండలి డిప్యూటీ మేనేజర్ ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ..కాలనీ ఏర్పడిన నాటి నుంచి సొంతంగా సెప్టిట్ ట్యాంకులను నిర్మించుకున్నామన్నారు. దీంతో కాలనీ మొత్తం దుర్వాసనతో, దోమలతో బాధపడుతున్నామన్నారు. కాలనీలో నూతన భూగర్భ డ్రైనేజీని నిర్మించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. దీనికి జలమండలి డిప్యూటీ మేనేజర్ సానుకూలంగా స్పందించారని కాలనీలో పర్యటించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎం.రవీందర్, డి.రఘుపతి తదితరులున్నారు.

నేడు విద్యుత్ సమస్యలపై సమావేశం

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్ని కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ డీఈ రమేష్‌చంద్ర శనివారం సమావేశం నిర్వహిస్తున్నారని మణికొండ మున్సిపాలిటీ, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు అలకాపూర్ టౌన్‌షిప్‌లోని నేచర్ వాక్ గేటెడ్ కమ్యూనిటీలోని క్లబ్ హౌస్‌లో ఈ సమావేశం ఉంటుందని, విద్యుత్ సమస్యలు ఉన్న అన్ని కాలనీలవాసులు హాజరై తమ సమస్యలను ఆయన దృష్టికి తేవాలని కోరారు.

ముగిసిన వారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: వారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బుద్వేల్ కోట మైసమ్మ ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు వందలాదిగా పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం కావడంతో పాటు వారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా అమ్మవారిని చూడ ముచ్చటగా అలంకరించారు. తెల్లవారుజామున అభిషేకం అనంతరం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని కుంకుమార్చన, అఖండ జ్యోతి హారతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మైలార్‌దేవ్‌పల్లి: కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలను దశల వారిగా పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలో పర్యటించి దెబ్బతిన్న సీసీ రోడ్లను పరిశీలించారు. అలాగే సీసీ రోడ్డు, భూగర్భ డ్రై నేజీ వ్యవస్థ కోసం జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో సమీక్షించారు. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నరోత్తంరెడ్డి, చక్రధర్, లక్ష్మణ్, రూపేష్, సత్యనారాయణ, బాల్‌రాజ్ పాల్గొన్నారు.



ఘన నివాళి

సాక్షి, సిటీబ్యూరో: శంషాబాద్ కురుమసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ తొలిపోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు దొడ్డి కొమురయ్యకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మామిడిపల్లి జంగయ్య, కర్రె మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 7వ డివిజన్‌లోని తిరుమల గార్డెన్‌లో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్ రెడ్డి, వార్డు ఆఫీసర్ బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌తో చర్చిస్తున్న మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్

బండ్లగూడ: ప్రజల సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకొని శాశ్వత పరిష్కారాలు చూపించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆదేశాల మేరకు కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రను కలిసి సమస్యలపై చర్చించారు. వీలైనంత తొందరలో ఎమ్మెల్యే చొరవతో ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అభివృద్ధి పనులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసేలా చూడాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజలకు ఇబ్బందులు ఉండవన్నారు.

కార్వాన్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి

గోల్కొండ: కార్వాన్‌లో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషరఫ్ ఫారూఖీతో కలిసి తాళ్లగడ్డ, జియాగూడ, తపాచాబుత్ర, కార్వాన్, ఎండీలైన్స్, శాతం చెరువు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో 33 కేవీ సబ్‌స్టేషన్‌లను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..సబ్‌స్టేషన్‌లను ఆధునీకరించి వీటితో పాటు కొత్త 33 కేవీ సబ్‌స్టేషన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 102, ఎండిలైన్స్ తదితర ప్రాంతాల్లో ఉన్న 33 కేవీ సబ్‌స్టేషన్‌లను ఇతర ప్రాంతాలకు మార్చాలని ఆయన కోరారు. ముషరాఫ్ ఫారూఖీ మాట్లాడుతూ.. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు మార్పులు చేస్తున్నామన్నారు.

సెల్‌ఫోన్ పేలి వ్యక్తికి గాయాలు

అత్తాపూర్: ప్యాంట్ జేబులో ఉన్న మొబైల్ పేలడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అత్తాపూర్‌లో నివాసముండే శ్రీనివాస్.. మొబైల్ ఫోన్‌ను జేబులో పెట్టుకోని నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలింది. పేలుడుతో శ్రీనివాస్ తొడ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఓవర్ హీట్ కారణంగా పేలినట్లు పోలీసులు భావిస్తున్నారు.

పోలీసులకు సన్మానం



మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు పోలీసులు బదిలీపై వెళ్తున్న, రిలీవ్ అయిన పోలీసులను శుక్రవారం సన్మానించారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ కేఎస్ రావు, ఏసీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సైలు జి.చంద్రకాంత్, వి.స్వరాజ్యం, ఎఎస్సైలు ఎల్.వెంకట్‌రెడ్డి, కె.మహేశ్వర్, హెచ్‌సి ఆర్.నారాయణరెడ్డిను పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు.

రేపు వేణుగోపాల స్వామి పుష్పాభిషేకం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల గ్రామంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం పుష్పాభిషేకం నిర్వహిస్తున్నట్టు అర్చకుడు రాజగోపాలచారి తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయంలో జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న సురేష్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోకరి సురేష్‌గౌడ్ అన్నారు. 18వ డివిజన్ ఆనంద్‌నగర్ కాలనీ, ధాత్రి కాలనీలో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అభివృద్ధి పనులను చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందిగా లేకుండా రోడ్డు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో జగన్నాథ రథయాత్ర



రథయాత్రను ప్రారంభిస్తున్న మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: జగన్నాథ రథయాత్రను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలోని రామాలయం నుంచి ప్రధాన వీధుల ద్వారా తిరిగి రామాలయానికి రథయాత్ర చేరుకుంది. రథానికి మణికొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డితో పాటు కాలనీవాసులు నిర్వహించారు. అనంతరం రథాన్ని ప్రధాన వీధుల మీదుగా కాలనీలో తిప్పారు.

అలంలకు ప్రార్థనలు

గోల్కొండ: ముస్లింలు మొహర్రం సంతాప దినాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. అలంలు కొలువుదీరిన ఆషూర్‌ఖానాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. అలంలకు దట్టీలు సమర్పించి పూలమాలలు వేసి తమ భక్తిని చాటుకుంటున్నారు. ఆసిఫ్‌నగర్, అహ్మద్‌నగర్‌లోని ఫస్ట్ లాన్సర్, టోలిచౌకీ, గోల్కొండ తదితర ప్రాంతాల్లోని ఆషూర్‌ఖానాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. మరోవైపు గోల్కొండ కోట–రాందేవ్‌గూడ రోడ్డులో ఉన్న ఆషూర్‌ఖానా వద్ద నల్లటి దుస్తులు ధరించి షియా ముస్లింలు మాతం నిర్వహిస్తూ మజాలిస్ జరిపారు.

నేడు మణికొండలో ఎమ్మెల్యే పర్యటన

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని శివనగర్, అలకాపూర్ టౌన్‌షిప్, స్పెక్ట్రం విల్లాస్, వెంకటేశ్వర కాలనీ, అలిజాపూర్ రోడ్డు, తిరుమలహిల్స్ పార్క్, శివాజీనగర్ కమ్యూనిటీ హాల్, మణికొండ మర్రిచెట్టు కమ్యూనిటీహాల్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించేందుకు శనివారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ హాజరవుతున్నట్టు మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. రూ.7.52కోట్ల నిధులతో చేపట్టే పనులకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు. ఆయా కాలనీ ప్రజలతో పాటు నాయకులు, అధికారులు కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: ఫీడర్ల మరమ్మతు కారణంగా శనివారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని మణికొండ ఏఈ సంతోష్ కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కేపీఆర్ కాలనీ, మణికొండ గార్డన్, సుందర్‌గార్డన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏరియా, పోచమ్మ కాలనీ, 9 బార్ పక్కన విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 13, కూలీకుదుబ్ షా కాలనీ, పెంటయ్యనగర్, స్కైలా అపార్ట్‌మెంట్స్, వినాయకనగర్ ఫేజ్–2, అలకాపూర్ సెక్టార్–2ఎ, 2బి, 2సి, 2బీ, సెక్రటేరియట్ కాలనీ, ఆదిత్య ఫోర్ట్ విల్లాల ప్రాంతంలో సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ తెలిపారు.

8 నుంచి డిప్లొమా కోర్సుల కౌన్సెలింగ్

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 8 నుంచి 11 వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్. విద్యాసాగర్ తెలిపారు. ఈ డిప్లొమా ప్రవేశానికి పాలీసెట్‌లో తప్పనిసరిగా ర్యాంక్ రావాలని అన్నారు. కౌన్సెలింగ్ హాజరయ్య విద్యార్థుల ర్యాంకుల వివరాలు ఆయా తేదీలు ఇతర పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ చూడాలన్నారు. ఈ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు కోర్సులకు సంబంధిత ఫీజును తీసుకురావాలని సూచించారు. పాలీసెట్ల ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ జరుగుతుందని, దీంతో పాటు రిజర్వేషన్ల నిబంధనలకు లోబడి ప్రక్రియ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

పిల్లల ఎదుగుదలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



పిల్లల బరువు చెక్ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి

మైలార్‌దేవ్‌పల్లి: పద్మశాలిపురం అంగన్‌వాడీ సెంటర్–1లో శుక్రవారం బరువు తక్కువగా ఉన్న చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి చిన్నారులకు బాలామృతం, గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బరువు తక్కువగా ఉన్న పిల్లల ఆరోగ్యం మెరుగుపడేందుకు పోషకాహారం అందించడం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పర్ మంగదేవి, అక్షిత, స్వాతి, శ్రీదుర్గవల్లి తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

మణికొండ: తెలంగాణ సాయుధ పోరాటంలో మడమ తిప్పకుండా పోరాటం చేసిన దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతిని పురస్కరించుకుని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని బీరప్ప, మల్లన్న దేవాలయాల సముదాయంలో శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. మణికొండ కురుమ సంఘం చైర్మెన్ బి. జైహింద్‌రావు, అధ్యక్షుడు సి. బీరప్ప, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో కోశాధికారి గణేష్, సభ్యులు యాదయ్య, బి. శ్రీరాములు పాల్గొన్నారు.

రేపు 'సండే ఈవెనింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. అ సందర్భంగా ' ఆస్టియో ఆర్థ రైటిస్ ఆఫ్ ది నీ' ప్రివెన్షన్ అండ్ ట్రీట్‌మెంట్ అనే అంశంపై హైదరాబాద్‌లోని ఉదయ్ ఒమ్ని ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఉదయ్ ప్రకాశ్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.